# ఔట్‌సోర్సింగ్ - ఒకటి

ఈ రోజుల్లో ఎక్కడ చూసినా ఎప్పుడు చూసినా వద్దనుకున్నా వినపడే మాట ఔట్‌సోర్సింగ్. ఔట్‌సోర్సింగ్. ఔట్‌సోర్సింగ్. దీని అర్థమేమిటో చాలమందికి తెలుసును నాకు తెలుసు. ఈమాటకి అర్థం ఎంతమందికి తెలుసో దీన్ని అపార్థం చేసుకున్న వాళ్ళు దాంట్లో సగంమంది వున్నారు.

ఇంతకీ అసలు ఔట్‌సోర్సింగ్ అంటే ఏమిటి? ఏమా కథ? ఎందుకీ ఔట్‌సోర్సింగ్? దానివల్ల లాభాలేమిటి? నష్టాలేమిటి? అనే అన్ని ప్రశ్నలకీ జవాబులు తెలుసుకోవటం అవసరం. నేను అమెరికాలో ఒక పెద్ద సెమీకండక్టర్ కంపెనీలో ఔట్‌సోర్సింగ్ గ్రూప్‌ని మూడున్నర ఏళ్ళు మేనేజ్‌చేశాను కనుక ఆ అనుభవంతో ఈ ప్రశ్నలకి జవాబులు తెలుసుకోవటానికి ప్రయత్నంచేద్దాం. సాంకేతికంగా చెప్పుకుని అందర్నీ భయపెట్టకుండా, ఊరికే సరదాగా చెప్పుకుందాం. ఒకే వ్యాసంలో ఇవన్నీ విపులంగా చెప్పటం కూడా కష్టం. అందుకే ఔట్‌సోర్సింగ్-ఒకటి, ఔట్‌సోర్సింగ్ - మరోటి అనే రెండు వ్యాసాల్లో కబుర్లలాగా చెప్పుకుందాం.

ఎప్పుడో నేను గుంటూర్లో వుంటున్నప్పుడు మా ఇంటి పక్కనే ఒకావిడ, పేరు రత్తమ్మగారు వుండేది. మా ఇంట్లో వంటమనిషివున్నా ప్రొద్దున్నే టిఫిన్ మాత్రం మా అమ్మే తయారుచేసేది. పిండి రుబ్బుకొని పదిమందికీ ఇడ్లీలు వేయటం, దాంట్లోకి టమోటా పచ్చడీ, కొబ్బరి పచ్చడీ చేసుకోవటం.తమాషా పెద్ద పని. అందుకని తరువాత ఇడ్లీలు ఇంట్లో చేసుకోకుండా రత్తమ్మగారిదగ్గర కొనుక్కొచ్చేవాళ్ళం. హోటల్నించి తెచ్చుకోవచ్చు కానీ, నిజంచెప్పొద్దూ రత్తమ్మగారి ఇడ్లీలుమాత్రం చాల బాగుండేవి. ఎంతో రుచిగా చేసేది. వేడివేడిగా, తెల్లగా మబ్బు తునకల్లా వుండేవి. కొబ్బరి పచ్చడి సంగతి సరేసరి. అదీకాక హోటల్ ఇడ్లీలకన్నా ఆవిడ దగ్గర ఇడ్లీలు చౌక.

పైన చెప్పిన రత్తమ్మగారి కథనే ఈ రోజుల్లో ఇంగ్లీషులో తర్జుమా చేసి ఔట్‌సోర్సింగ్ అంటున్నారు. అంటే మీఇంట్లో తయారుచేసుకుంటే పని ఎక్కువవుతుంది. ఆ పనికూడా మీ వంటమనిషే చేసి పెడితే ఆవిడకి మీరు ఇంకా ఎక్కువగా డబ్బులు ఇవ్వాల్సివస్తుంది. తక్కువ ఖర్చుకి నాణ్యంగాచేసి ఇచ్చేవాళ్ళు దొరికితే అంతకన్నా శాంతమూ లేదు సౌఖ్యమూ లేదు.

ఇదే ఇడ్లీల కథ హైటెక్ వాతావరణంలో ఎలా వుంటుందో చూద్దాం.

మా కంపెనీ తయారు చేసే మెషిన్లు, ఇంటెల్ తోషిబా శామ్‌సంగ్‌లాటి కంపెనీలు కొనుక్కొని, వాటితో రకరకాల సెమీకండక్టర్ చిప్స్ చేస్తారు. ఒక్కొక్క మెషీనూ రెండు మిలియన్ల డాలర్ల నించీ, మూడు మిలియన్ల దాకా ఖరీదు చేస్తాయి. వాటిలోవున్న టెక్నాలజీ చాల ప్రత్యేకమైనది. ఖరీదైన రీసెర్చి ఫలితం.

ప్రతి మెషీన్‌లోను కొన్ని వందల కేబుల్సూ, పిసి బోర్డ్లూ, పవర్ సప్లైలూ, మెషినింగ్ చేసిన భాగాలూ, షీట్‌మెటల్ కవర్లూ, న్యూమాటిక్ పానళ్ళూ, వాల్వులూ ఇలా కొన్ని వేల (పార్ట్స్) భాగాలుంటాయి. అవన్నీ మొదట్లో మా కంపెనీయే చేసేది. చేసుకోవచ్చు కూడా. కానీ దానివల్ల లాభాలకన్నా నష్టాలే ఎక్కువ. అవన్నీ చేయటానికి ఎంతోమంది పనివాళ్ళు రకరకాల పనులలో నిపుణులు కావాలి. వాళ్ళకి జీతాలే కాక గీతాలుకూడా ఇవ్వాలి. గీతాలంటే లంచాలు కాదు. వాళ్ళకి కేటాయించిన ఆఫీసు స్థలమూ, కరెంటూ, కంప్యూటర్లూ, ఫోనూ, శెలవలు, మెడికల్ ఇన్స్యూరెన్స్, కారు పార్కింగ్‌కి స్థలం, ట్రైనింగూ ఇలా చాల వుంటాయి. వాటన్నిటినీ కలిపితే జీతం ఎంతో, గీతం దాంట్లో సగం పైన అవుతుంది. అంతేకాక ఆ అసెంబ్లీలు చేయటానికి వేరే స్థలం, అవి చేయటానికి కావలసిన మెషీన్లు, పరికరాలూ, కరెంటూ నీళ్ళూ అన్నీ కలిపి తడిసి మోపెడవులాయి. వీటన్నిటినీ కలిపి ఓవర్ హెడ్ అంటారు. తలకు మించినవి అని అర్ధమేమో!

ఇంతకన్నా ముఖ్యమైనది ఇంకొకటుంది. మనకి పుట్టినరోజు కేక్ కావాలంటే బేకరీకి వెళ్ళి కొనుక్కుంటాం. తాపేశ్వరం కాజాలో, కాకినాడ మామిడి తాండ్రో, బెంగాలీ రసగుల్లాలో కావాలంటే బయట మంచి స్వీట్ల షాపులో కొనుక్కుంటాం. మనం ఇంట్లోనూ వాటిని చేసుకోవచ్చు. కానీ మనకన్నా ఆ షాపుల వాళ్ళు బాగా చేస్తారు. ఎందుకంటే వాళ్ళవి రోజూ చేస్తుంటారు కదా. అదే వాళ్ళ జీవనోపాధి కూడా. అందుకని దాంట్లో వాళ్ళు మందపాటిగా కాకుండా, ఘనాపాటిలా వుండాలి. అలా వున్న వాళ్ళే ఈనాటి వ్యాపారరంగం పోటీలో సూటిగా నిలబడగలుగుతారు. అలాగే ఒక కేబుల్ కంపెనీ, పిసి బోర్డు కంపెనీ, ఒక పవర్ సప్లై కంపెనీ, మా కన్నా వాటిని బాగా చేయగలవు. నాణ్యత పెంచగలవు. ఖరీదు తగ్గించగలవు. మరి అవి మేమెందుకు చేయటం?

ఈ చిన్న సామాన్లు చేయటానికీ, వాటి గురించి టెక్నాలజీలో ప్రగతినీ రోజువారీగా పరిశీలించటానికీ, చాల టైమూ, డబ్బు ఖర్చుపెట్టాలి. అందుకని, ఏ పనిలో నిపుణులైన వారి చేత ఆ పని చేయిస్తే మనకి ఆ టైమూ డబ్బూ కలిసి వస్తాయి. అదీకాక మా కంపెనీలాంటి పెద్ద కంపెనీలకి ఓవర్‌హెడ్ ఎక్కువ. చిన్న కంపెనీలకి ఓవర్‌హెడ్ తక్కువ కనుక ఆ భాగాల ఖరీదుని బాగా తగ్గించగలవు. అందుకని ఈ ఔట్‌సోర్సింగ్‌వల్ల ఎన్నో లాభాలున్నాయి. మరి నష్టాలు? కొన్ని నష్టాలలా కనపడే లాభాలయితే, కొన్ని జాగ్రత్తగా వుండకపోతే నష్టపెట్టే కష్టాలు.

నేను ఔట్‌సోర్సింగ్ చేసే సమయంలో, ఒక మాన్యుఫాక్చరింగ్ వర్క్ సెంటర్‌కి వెళ్ళి, "అయ్యా! మీరు చేస్తున్న ఈ అసెంబ్లీలని ఇందు మూలముగా నేనూ, నా ఇంజనీర్లూ ఔట్‌సోర్సింగ్ చేస్తున్నాం. దానివల్ల మన కంపెనీకి లాభం వస్తుంది. ఎందుకంటే మీ అందరికీ ఉద్యోగాలు ఊడతాయి. ఇటు మీ జీతాలలో లాభం, అటు ఓవరుహెడ్డూ అన్నీ లాభమే. కనుక మీ ఉద్యోగాలు పీకే నా ప్రయత్నంలో మీ సహాయం. సహకారం కావాలి. అందించండి!" అని అడిగితే, వాళ్ళు ఏమంటిస్తారో ఊహించుకోవచ్చు.

అలాగే ఈ ఔట్‌సోర్సింగ్‌లో జాగ్రత్తగా వుండకపోతే కష్టపెట్టే నష్టాలు.

మేము ఇంకోదేశంలో ఈ ఔట్‌సోర్సింగ్ కార్యక్రమంలోనే ఒక కంపెనీకి వెళ్ళాం. అక్కడ విన్న కథ మమ్మల్నందర్నీ ఒళ్ళు దగ్గర పెట్టుకునేలా చేసింది. ఆ కంపెనీ పేర్లు చెప్పకూడదు కనుక, వాటికి సరదాగా మన పేర్లు పెట్టుకుందాం.

ఆ కంపెనీ పేరు సుబ్బయ్యా కంపెనీ. జపాన్‌లోని కామాక్షి మోటర్ సైకిళ్ళని , జపాన్ టెక్నాలజీతో సుబ్బయ్యా కంపెనీ ఇంకోదేశంలో తయారు చేసి ఉత్పత్తి చేస్తున్నది. మాకు సుబ్బయ్యా కంపెనీ నాణ్యతని తగ్గింపు ఖరీదుల్నీ చూస్తే ఆశ్చర్యంవేసింది. ఇంకోదేశం పారిశ్రామికంగా ఎందుకు ముందుకిపోయిందో అక్కడ క్వాలిటీ ప్రోగ్రామునీ మాన్యుఫాక్చరింగ్ చేసే విధానాన్నీ చూస్తే ఇట్టే అర్థమైపోతుంది. నేనూ, ఇంజనీర్లూ తృప్తి పడ్డాం. అప్పుడే విన్నాం ఈ వింత కథని.

సుబ్బయ్యా కంపెనీ జపాన్‌వాళ్ళు చెప్పినట్టు రోజుకి మోటార్ సైకిళ్ళు ఐదు వందలు కాకుండా, వెయ్యి తయారుచెయటం మొదలు పెట్టారు. ఐదు వందం మోటార్ సైకిళ్ళమీద కామాక్షి ముద్ర వేసి, మిగతా ఐదు వందలమీదా మీనాక్షి పేరు వేయటం సాగించారు. జపాన్ కామాక్షిని జపాన్ పంపించి, మధురమైన మీనాక్షిని మాత్రం వాళ్ళబ్బ సొమ్ములా ఇంకా చౌకగా ఇంకో దేశంలో, మరింకో దేశంలో, మరింకెన్నెన్నోదేశాల్లో అమ్మి, పేరూ డబ్బూ గడించుకున్నారు. దరిమిలా ఈ సంగతి తెలుసుకుని, కామాక్షిని కామాక్షివారే జపాన్‌లో తయారు చేసుకోవటం మొదలుపెట్టారు. ఇంకో దేశంలో కాపీరైటుని కాఫీలా త్రాగేసి, పేటెంట్లని పెసరట్లులా తినేసి, ఇలాటి వాటికి ఖాతరు చేయకుండా కాటికి పంపిస్తారు కనుక, కామాక్షి కంపెనీ ఏమీ చేయలేక, ఆ కథని కంచికి పంపించేశారు. కామాక్షి కథ ఎలాగూ కంచికి వెళ్ళింది కనుక, మళ్ళీ కాలిఫోర్నియాకి తీసుకువెళ్ళటం ఎందుకని ఆ కంపెనీతో మేము తెగతెంపులు చేసుకోవాల్సి వచ్చింది.

మరి ఈ ఔట్‌సోర్సింగ్‌కీ, ప్రపంచీకరణానికీ సంబంధం వుందా? ఉంది. లేదు. ఎలాగో చూద్దాం.

దానికి మళ్ళీ రత్తమ్మగారి ఇడ్లీల కథకి వెళ్దాం. ఇడ్లీ ఔట్‌సోర్సింగ్ పక్క సందులోనే వున్న రత్తమ్మగారికి చేసినందు వల్ల లాభాలేమిటో తెలుసుకున్నాం. అంతేకాదు అదీ మన మంచికే అని ఒప్పుకున్నాం కూడాను.

మరి ఈ హైటెక్ అసెంబ్లీలుకూడా మీ ఇంటి పక్కనేవున్న రత్తమ్మగారి లాటి వాళ్ళ దగ్గర తెచ్చుకోవచ్చు కదా! ఇడ్లీల కోసం మీరు గుంటూరునించీ తెనాలో, తిరువనంతపురమో, తైవానో వెళ్ళరు కదా! అమెరికానించీ మరి చైనా మెక్సికో మలైషియా కొరియాల కెందుకు వెడతారూ. మీ దేశంలో ఉద్యోగాలన్నీ పరగడుపున ప్రపంచపరం చేసేసి?

ఓ! అదా? అది ఇంకో కథ. అదేమిటో "ఔట్ సోర్సింగ్–మరోటి" అనే తరువాత వ్యాసంలో వచ్చే వారం చూద్దాం.

అప్పటిదాకా ఓపిక పట్టండి మరి.

* * *